


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




గురువారం 22-01-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 226 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం రేవంత్‌తో చిరంజీవి





## 4 బస్సులు ఢీ... 26 మందికి గాయాలు




## టీటీడీ జేఈవోగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎ. శరత్ నియామకం





## లారీ బోల్తా.. కాల్వ నీటిలోకి రసాయన వ్యర్థాలు




## నాసాకు గుడ్ బై చెప్పిన సునీతా విలియమ్స్..27 ఏళ్ల అద్భుత ప్రయాణానికి ముగింపు




## పురుషుని కడుపులో గర్భాశయం.. రిపోర్టు చూసి అవాక్కైన వ్యక్తి




## పూరి జగన్నాథ్ ఆలయానికి బాంబు బెదిరింపు భద్రత కట్టుదిట్టం




# ఐఐటీ కాన్పూర్ పీహెచ్‌డీ విద్యార్థి క్యాంపస్‌లో ఆత్మహత్య

### మూడు వారాల్లో రెండో ఘటన




న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): ఐఐటీ కాన్పూర్ లో విద్యార్థుల ఆత్మహత్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. తాజాగా కాన్పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల ప్రకారం, 25 ఏళ్ల పీహెచ్‌డీ స్కాలర్ క్యాంపస్ లోపల ఉన్న నివాస భవనంలోని ఆరవ అంతస్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఇది కేవలం 23 రోజుల్లోపు జరిగిన రెండవ ఆత్మహత్య కేసు. అధికారుల ప్రకారం, మరణించిన విద్యార్థిని రాంస్వరూప్ ఇశ్రాంగా గుర్తించారు. అతను ఎర్త్ సైన్సెస్ విభాగంలో రీసెర్చ్ స్కాలర్. మృతుడు తన భార్య మంజు, వారి మూడేళ్ల కుమార్తెతో కలిసి క్యాంపస్‌లోని న్యూ SBRA రెసిడెన్షియల్ బ్లాక్‌లోని AA 21 అపార్ట్‌మెంట్‌లో నివసించాడు. ఇశ్రాం రాజస్థాన్‌లోని చురు జిల్లా నివాసి.

కళ్యాణ్‌పూర్ పోలీస్ స్టేషన్ నుండి ఫోరెన్సిక్ నిపుణులతో కలిసి పోలీసు బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించాయని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.ఎం. ఖాసిం అబిది తెలిపారు. “విద్యార్థి చాలా కాలంగా మానసిక ఒత్తిడికి లోనవుతున్నాడని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. గతంలో అతనికి చాలాసార్లు కౌన్సెలింగ్ జరిగింది” అని డీసీపీ తెలిపారు.

# అనుమానంతో భార్యలను కడతేర్చిన భర్తలు




న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): అనంతపురం జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి దాటాక రెండు వేర్వేరు ప్రాంతాల్లో దారుణ హత్యలు కలకలం రేపాయి. కుటుంబ కలహాలు, భార్యల ప్రవర్తనపై పెంచుకున్న అహేతుక అనుమానమే ఈ రెండు ఘటనల్లోనూ ప్రాణాలు తీయడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పచ్చని సంసారాల్లో అనుమానం పెనుభూతంగా మారి ఇద్దరు మహిళల ప్రాణాలను బలితీసుకోవడం స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ జంట హత్యల నేపథ్యంలో పోలీసులు రంగంలోకి దిగి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఎల్లమ్మ కాలనీలో గొంతుకోసి హత్య: పోలీసుల వివరాల ప్రకారం అనంతపురం నగరంలోని ఎల్లమ్మ కాలనీలో వీర అనే వ్యక్తి తన భార్య గంగను అత్యంత దారుణంగా హత్య చేశాడు. భార్య ప్రవర్తనపై అనుమానంతో వీరిద్దరి మధ్య గత కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలోనే నిన్న రాత్రి ఇద్దరి మధ్య వాగ్వాదం పెరగడంతో, తీవ్ర ఆగ్రహానికి లోనైన వీర తన భార్య గంగ గొంతు కోసి చంపేశాడు. సమాచారం అందుకున్న అనంతపురం ఒకటో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

# భర్త నాలుక కొరికిన భార్య.. ట్విస్ట్ మామూలుగా లేదుగా ?




న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): ఇటీవలి కాలంలో ఇష్టం లేని పెళ్లి, పెళ్లికి ముందే లవ్ ఎఫైర్స్ ఉండడంతో పెళ్లైన కొన్ని నెలలకే గొడవలు మొదలవుతున్నాయి. కొందరు డివోర్స్ తీసుకుంటుండగా మరికొందరు దారుణాలకు ఒడిగడుతూ భార్యాభర్తలు ఒకరిని ఒకరు చంపుకుంటున్నారు. తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లోని మోడీ నగర్‌లోని ఒక కాలనీలో సోమవారం రాత్రి 1 గంటల ప్రాంతంలో జరిగిన వివాదం తర్వాత, కోపంతో ఉన్న భార్య తన భర్త నాలుకను పళ్లతో కొరికింది. తీవ్రంగా గాయపడిన భర్తను మొదట నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మీరట్‌కు తరలించారు. ఈ సంఘటనతో ఆగ్రహించిన కాలనీ మహిళలు నిందితురాలైన వివాహితపై దాడి చేశారు. వివాహిత మహిళ వేరే యువకుడిని వివాహం చేసుకోవాలని కోరుకుందని, కానీ కుటుంబం ఆమెను బలవంతంగా ఒప్పించి వివాహం చేసిందని యువకుడి కుటుంబం ఆరోపిస్తోంది. ఈ సమస్య కారణంగానే వివాదం తలెత్తింది. పోలీసులు నిందితురాలైన వివాహితను అరెస్టు చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గుడ్‌న్యూస్




న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా సొంత ఇంటిని నిర్మించుకుంటున్న సుమారు 23 వేల మంది లబ్ధిదారులకు రూ.262.51 కోట్లను విడుదల చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతం తెలిపారు. ఈ మొత్తాన్ని ఆధార్ నెంబర్ ఆధారంగా లబ్ధిదారుల ఖాతాల్లో నేరు గా జమ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వారం చేసిన చెల్లింపుల్లో, బేస్‌మెంట్ స్థాయి నిర్మాణ పనులను పూర్తిచేసిన లబ్ధిదారులు 2,763 మంది, గోడలు, శ్లాబ్ కట్టడాల స్థాయి దాటిన వారు 20,186 ఉన్నారని తెలిపారు. ఇదిలా ఉంటే ఇప్పుతవరకు రూ.4,351 కోట్లకు పైగా నిధులను లబ్ధిదారులకు విడుదల చేశామని, బిల్లులను విడుదల చేయడంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## హైదరాబాద్‌కు మరో అంతర్జాతీయ సంస్థ కార్యాలయం..

### దావోస్ వేదికగా కీలక ప్రకటన




న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): గ్లోబల్ ఫిన్‌టెక్, బీఎఫ్ఎస్ఐ రంగాలకు హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. తాజాగా హైదరాబాద్ నగరంలో మరో అంతర్జాతీయ సంస్థ కార్యాలయం ప్రారంభమైంది. ప్రముఖ గ్లోబల్ పేమేంట్స్ దిగ్గజ కంపెనీ మాస్టర్ కార్డ్ తన కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది.

## ట్రంప్ టారిఫ్ హెచ్చరికలు.. భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు




న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): స్టాక్ మార్కెట్లు వరుసగా భారీ నష్టాలను చవిచూస్తున్నాయి. తాజాగా బుధవారం ఉదయం కూడా అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల వాతావరణంతో ఉదయం నుంచే స్టాక్ మార్కెట్లు సూచీలు నష్టాల్లో పయనించాయి. ముఖ్యంగా సెన్సెక్స్ 690 పాయింట్లకు పైగా కుప్పకూలి 81,582 వద్ద కొనసాగుతుండగా, నిఫ్టీ 25,100 మైలురాయి కంటే దిగువకు పడిపోయింది.




# హరీశ్ రావు బాధితుడా? నిందితుడా?

## ఫోన్ ట్యాపింగ్ కేసులో అనూహ్య పరిణామం

- ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్ రావు విచారణ కీలకం
- హరీశ్ రావు బాధితుడా? నిందితుడా? అనే చర్చ
- 160 సీఆర్పీసీ కింద నోటీసులు, గంటల పాటు విచారణ
- “మీ ఫోన్ ట్యాప్ అయింది” అన్న సిట్ మాటలు?
- ప్రభాకర్, ప్రణీత్, శ్రవణ్ రావుల లింకులపై ప్రశ్నలు
- చాటింగ్ స్క్రీన్‌షాట్లతో హరీశ్ రావును ప్రశ్నించిన సిట్
- 2018 తర్వాత కేబినెట్ దూరంపై మళ్లీ చర్చ
- కేసీఆర్ కుటుంబ నిఘా ప్రచారంతో రాజకీయ వేడి

మిగతావి 2 లో

న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ):

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు సంచలనం సృష్టిస్తోంది. కేసు దర్యాప్తులో ఎప్పటికప్పుడు కొత్త ట్విస్టులు ఉత్కంఠ రేపుతున్నాయి. తాజాగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విచారణతో ఈ కేసులో మరో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. గత ప్రభుత్వంలో మంత్రిగా కీలకంగా వ్యవహరించిన హరీశ్ రావుపై దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ప్రత్యర్థుల ఫోన్లను ట్యాపింగ్ చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో160 సీఆర్పీసీ కింద హరీశ్ రావుకు సిట్ నోటీసులు ఇవ్వగా నిన్న ఆయన విచారణకు హాజరయ్యారు. దాదాపు 7 గంటల పాటు సాగిన ఈ విచారణలో మీ ఫోనే ట్యాప్‌కు గురైందని సిట్ అధికారులు హరీశ్ రావుకు వివరించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం


## హైదరాబాద్‌కు మరో అంతర్జాతీయ సంస్థ కార్యాలయం.. దావోస్ వేదికగా కీలక ప్రకటన

న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): గ్లోబల్ ఫిన్‌టెక్, బీఎఫ్ఎస్ఐ రంగాలకు హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. తాజాగా హైదరాబాద్ నగరంలో మరో అంతర్జాతీయ సంస్థ కార్యాలయం ప్రారంభమైంది. ప్రముఖ గ్లోబల్ పేమెంట్స్ దిగ్గజ కంపెనీ మాస్టర్ కార్డ్ తన కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించింది. దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వేదికగా మాస్టర్ కార్డు సీఈవో మైఖేల్ మీబాచ్ ఈ కీలక ప్రకటన చేశారు. ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన ఆయన డిజిటల్ ఎకనామీ, సెబర్ సెక్యూరిటీ రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా భారీ పెట్టుబడులు ప్రవహిస్తున్నాయని చెప్పారు. భార్త ను ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ ఎకనామీగా అభివర్ణించారు. సైబర్ సెక్యూరిటీపై భారత్ దృష్టి సారించడం మా సంస్థకు సానుకూల అంశం అన్నారు. ఇండియాలో హైదరాబాద్ లో మాస్టర్ కార్డు తాజాగా కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు ఏఐ గ్యారేజ్ ను విస్తరించడం ద్వారా భారత్ విషయంలో కమిట్‌మెంట్ తో ఉందని చెప్పారు.

## హరీశ్ రావు బాధితుడా? నిందితుడా?

### ఫోన్ ట్యాపింగ్ కేసులో అనూహ్య పరిణామం

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలు ఉండగా ఇప్పుడీ తాజా ట్విస్ట్ తో ఈ కేసులో హరీశ్ రావు బాధితుడా లేక నిందితుడా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో వ్యక్తం అవుతోంది.

ఆధారాలు ముందు పెట్టిన సిట్!: విచారణ సందర్భంగా పలు కీలక విషయాలపై హరీశ్ రావును ప్రశ్నించిన సిట్ అధికారులు.‘2018 శాసనసభ ఎన్నికల తర్వాత మీతో పాటు మీ అనుచరులు, బీఆర్ఎస్‌లోని మరో సీనియర్ నేత ఫోన్లు ఏడాది పాటు నిఘా ఉంచారనే విషయాన్ని సిట్ అధికారులు హరీశ్ రావు దృష్టికి తీసుకువెళ్లారు. అయితే ఈ విషయంపై తొలుత ఖంగుతిన్న హరీశ్ రావు ఆ తర్వాత నేను నమ్మను అని బదులిచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో నిందితులు ప్రభాకర్ రావు, ప్రణీత్ రావు, శ్రవణ్ రావులతో ఉన్న లింకేంటి అనే విషయాన్ని ఆరా తీసినట్లు తెలిసింది. 2023 నవంబర్ 30న శాసనసభ ఎన్నికలకు ముందురోజు వరకు శ్రవణ్ రావు ఇచ్చిన ఫోన్ నంబర్లను ప్రభాకర్ రావు, ప్రణీత్ రావు ట్యాప్ చేయించడానికి కారణం ఏమిటని ప్రశ్నించగా హరీశ్ రావు సరైన సమాధానాలు ఇవ్వలేదని తెలిసింది. ఈ క్రమంలో శ్రవణ్ రావు, ప్రణీత్ రావు ల మధ్య జరిగిన చాటింగ్ స్క్రీన్ షార్టులను హరీశ్ రావు ముందుంచి ప్రశ్నించగా తనకు ఆ విషయాలు తెలియదని సమాధానం చెప్పినట్లు సమాచారం. సిట్ ప్రశ్నలకు సమాధానాల సమయంలో చాలా వరకు గుర్తులేదు. తెలియదు, నేను నమ్మను అనే పదాలతో బదులిచ్చినట్లు తెలుస్తోంది.

హరీశ్ రావు దారెటు?: హరీశ్‌రావు ఫోన్ ట్యాపింగ్‌కు గురైందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. నిజానికి 2018లో రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక హరీశ్ రావుకు మంత్రివర్గంలో చోటు దక్కలేదు. దాంతో హరీశ్ విషయంలో కేసీఆర్ అనుమానిస్తున్నారని అందువల్లే ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకోలేదనే గుసగుసలు వినిపించాయి. ఆ సమయంలో తన ఫోన్ ట్యాప్ అవుతోందని అందువల్ల తనకు ఎవరూ ఫోన్ చేయవద్దని హరీశ్ రావు చెప్పేవారని కేసీఆర్ కు సన్నిహితుడిగా పిలువబడే వి.ప్రకాశ్ గతంలో చెప్పిన వీడియో ఇప్పుడు మరోసారి వైరల్ అవుతోంది. అయితే నిన్న సిట్ విచారణ అనంతరం తెలంగాణ భవన్‌కు వచ్చిన హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ తానే సిట్‌కు 100 ప్రశ్నలు వేశానని చెప్పారు. కానీ తన ఫోన్ ట్యాప్ అయిందనే విషయం ప్రస్తావనకు వచ్చినందనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం హరీశ్ రావు ఫోన్ పై నిఘా పెట్టారనే విషయాన్ని సిట్ ప్రస్తావించిందని జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో మొదటి నుంచి కేసీఆర్ వెంట నడిచిన హరీశ్ రావు ఫోన్ పైనే నిఘా ఉంచారనే ప్రచారంతో హరీశ్ రావు దారెటు అనేది ఉత్కంఠగా మారింది. మొత్తంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కుటుంబ సభ్యులలో ఇప్పటి వరకు కవిత, ఆమె భర్తపై నిఘా ఉంచారనే ప్రచారం జరుగగా ఇప్పుడు ఆ జాబితాలో హరీశ్ రావుపై సైతం ఉన్నారనే టాక్ హరీశ్ రావు అభిమానులను షాక్ కు గురి చేస్తోంది. జరుగుతున్న ప్రచారం ప్రకారం హరీశ్ రావు ఫోన్ పై నిఘా ఉంచింది నిజమే అయితే అది కేసీఆర్ చేయించారా? లేక మరెవరైనా చేయించారా అనేది ఇప్పుడు సస్పెన్స్ గా మారింది.

## ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం రేవంత్‌తో చిరంజీవి

న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): స్విట్జర్లాండ్లోని దావోస్ లో రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించడమే లక్ష్యంగా జరుగుతోన్న ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తో కలిసి టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి కూడా హాజరయ్యారు. చిరంజీవి అక్కడే ఉన్న జ్యూరిక్ లో ఉన్నారని తెలుసుకున్న సీఎం రేవంత్.. ఆయన్ను కూడా ప్రపంచ ఆర్థిక సదస్సుకు ఆహ్వానించారు. ఈ సదస్సులో ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్ ను చిరంజీవి ఆసక్తిగా వీక్షించారు. అనంతరం ఆయనతో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. కుటుంబంతో కలిసి మన శంకరవరప్రసాద్ గారు సినిమా చూశానని, చాలా బాగుందని చెప్పారు. ఈ సందర్భంగా చిరంజీవికి అభినందనలు తెలిపారు. కాగా.. ప్రస్తుతం చిరంజీవి స్విట్జర్లాండ్ లో ఫ్యామిలీ ట్రిప్ లో ఉన్నారు.

## ట్రంప్ టారిఫ్ హెచ్చరికలు.. భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు


మొదటి పేజీ తరువాయి

గత సెషన్‌లో కూడా సెన్సెక్స్ 1,000 పాయింట్లకు పైగా నష్టపోగా, నేడు కూడా అదే ఒరవడి కొనసాగడం ఇన్వెస్టర్లలో ఆందోళన కలిగిస్తోంది.

ఈ భారీ పతనానికి ప్రధానంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొత్త టారిఫ్ విధానాలే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా కొనుగోలు చేసే ప్రతిపాదనను వ్యతిరేకించే యూరోపియన్ దేశాలపై 10% నుంచి 25% వరకు సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించడంతో గ్లోబల్ ట్రేడ్ వార్ భయాలు మళ్లీ మొదలయ్యాయి. దీనికి తోడు భారతీయ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున నిధులను ఉపసంహరించుకోవడం, రిలయన్స్ మరియు ఐసిఐసిఐ బ్యాంక్ వంటి దిగ్గజ కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఆశాజనకంగా లేకపోవడం కూడా మార్కెట్లను కుంగదీశాయి.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గుడ్‌న్యూస్

మొదటి పేజీ తరువాయి




మార్చి నాటికి లక్ష ఇళ్లు పూర్తి..ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఈ ఏడాది మార్చి నాటికల్లా లక్ష ఇండ్లను పూర్తి చేయడంతోపాటు, తదుపరి దశను ప్రారంభించడానికి ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమవుతున్నదని ఎండీ తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులు జోరుగా కొనసాగుతున్నాయని, మార్గదర్శకాలకు అనుగుణంగా ఇండ్లు కట్టుకుంటున్న వారందరికీ బిల్లులు సకాలంలో విడుదల అవుతున్నాయని పేర్కొన్నారు. పూర్తి పారదర్శకంగా, ఆన్‌లైన్‌లోనూ, క్షేత్ర స్థాయిలోనూ నిశిత పరిశీలన అనంతరమే బిల్లులు మంజూరవుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంతవరకు 2.50 లక్షల ఇండ్ల పనులు ప్రారంభమయ్యాయని, వీటిలో సుమారు 1.25 లక్షల ఇండ్లు గోడలు, శ్లాబ్‌లు త్వరలోనే పూర్తి కానున్నాయని తెలిపారు. మరో 75 వేల ఇండ్ల పనులు బేస్ మెంట్ స్థాయిని దాటిపోయాయని వెల్లడించారు. ఇండ్ల నిర్మాణాల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ కలెక్టర్లు తరచూ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నారని, నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

## 4 బస్సులు ఢీ.. 26 మందికి గాయాలు

న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): అర్ధరాత్రి రాజమండ్రిలో ఘోర బస్సు ప్రమాదం చోటు చేసుకుంది. రాజమండ్రిలోని దివాన్‌చెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థులతో ఉన్న రెండు బస్సులు, మరో రెండు ట్రావెల్ బస్సులను ఢీకొనడంతో 26 మంది పిల్లలు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం... నల్గొండ జిల్లా దిండి ప్రాజెక్టు సమీపంలోని గుండ్లపల్లి మోడల్ ప్రభుత్వ పాఠశాల, కళాశాలకు చెందిన 9వ, 10వ తరగతి మరియు ఇంటర్ విద్యార్థులు విహారయాత్రకు వెళ్లారు. 90 మంది బాలబాలికలు, టీచర్లు, సిబ్బంది సహా రెండు బస్సుల్లో అరకు, పాడేరు ప్రాంతాల్లో మూడు రోజుల పాటు పర్యటించి మంగళవారం అర్ధరాత్రి తర్వాత రాజమండ్రి వెళ్తున్నారు. అయితే దివాన్‌చెరువు దగ్గర ఓ గేదె రోడ్డుకు అడ్డుగా రావడంతో ముందు వెళ్తున్న ట్రావెల్ బస్సు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు.

దీంతో వెనుక వస్తున్న విద్యార్థుల రెండు బస్సులు, మరో ట్రావెల్ బస్సు ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బస్సుల్లో ఉన్న 26 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన విద్యార్థులను మూడు అంబులెన్స్‌లలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన విద్యార్థులను దివాన్‌చెరువులోని బాలవికాస్ మందిరానికి తరలించారు.

## టీటీడీ జేఈఓగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎ. శరత్ నియామకం

న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): తిరుమల తిరుపతి దేవస్థానం జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (హెల్త్ & ఎడ్యుకేషన్) గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎ. శరత్‌ను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2005 బ్యాచ్‌కు చెందిన ఆయన, బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ నియామకానికి సంబంధించి సాధారణ పరిపాలన శాఖ జీవో ఆర్టీ నెంబర్ 110ను విడుదల చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఈ ఉత్తర్వులను జారీ చేస్తూ, తదుపరి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ (ఎండోమెంట్) శాఖను ఆదేశించారు. గతంలో వివిధ హోదాల్లో పనిచేసిన శరత్ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఆయనకు ఈ బాధ్యతలను అప్పగించింది.

## అనుమానంతో భార్యలను కడతేర్చిన భర్తలు

మొదటి పేజీ తరువాయి

రాయవరంలో కత్తితో దాడి చేసి: మరో ఘటనలో జిల్లాలోని రాయవరంలో మారన్న అనే వ్యక్తి తన భార్య కుల్లాయమ్మ (43)ను కత్తితో నరికి చంపాడు. వీరిద్దరి మధ్య గొడవలు జరగడంతో నాలుగు రోజుల క్రితమే కుల్లాయమ్మ అనంతపురం నుంచి రాయదుర్గం సమీపంలోని తన పుట్టిల్లు రాయవరానికి వచ్చేసింది. అయితే నిన్న రాత్రి అక్కడికి చేరుకున్న భర్త మారన్న, తెల్లవారుజామున అందరూ నిద్రపోతున్న సమయంలో ఆమెపై కత్తితో దాడి చేసి ప్రాణాలు తీశాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అనుమానంతోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించి, నిందితుడి కోసం గాలిస్తున్నారు.

## లారీ బోల్తా.. కాల్వ నీటిలోకి రసాయన వ్యర్థాలు

న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): కాకినాడ జిల్లాలోని తొండంగి మండలం ఎ.వి.నగరం శివారులో ఓ ఫార్మా కంపెనీకి చెందిన లారీ బోల్తా కొట్టింది. రసాయన వ్యర్థాలతో వెళ్తున్న అది కాస్త అదుపు తప్పి పంట కాల్వలో పడింది. లారీలోని రసాయన వ్యర్థాలు కాల్వ నీటిలో కలిశాయి. ఈ ఘటనతో స్థానికంగా కలకలం రేగింది. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ పంట కాల్వపై పంపింగ్ స్కీమ్ ఆధారపడి ఉందన్నారు. పలు గ్రామాలకు కాల్వ ద్వారానే సాగు, తాగునీటి సరఫరా జరుగుతుందన్నారు. రసాయన వ్యర్థాల కారణంగా నీరు విషతుల్యం అయ్యే ప్రమాదం ఉందని గుర్తించామన్నారు. అందుకే ప్రవాహ దిశలోని గ్రామాల వారికి ముందస్తు హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఎవరూ కూడా కాల్వ నీటిని తాగకూడదని, ఇంటి అవసరాలకు వినియోగించకూడదని సూచించారు. అదే విధంగా సమీప చెరువులకు కూడా రసాయన వ్యర్థాలు నీటితోపాటు చేరే ప్రమాదం ఉందన్నారు. తాత్కాలికంగా కాల్వ నీటికి వాటిల్లోకి వెళ్లకుండా మళ్ళించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

విషయం తెలుసుకున్న మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, స్థానిక ఎమ్మెల్యే యనమల దివ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే బాధిత గ్రామాల ప్రజలకు సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నారు. తాగునీటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు ట్యాంకర్ల ద్వారా స్వచ్ఛమైన నీటిని గ్రామస్తులకు సరఫరా చేస్తున్నారు. రంగంలోకి దిగిన నిపుణులు నీటి శుద్ధికి చర్యలు చేపట్టారు. నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్ కు పంపించారు. అయితే ఆ ఘటనకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## నాసాకు గుడ్ బై చెప్పిన సునీతా విలియమ్స్ 27 ఏళ్ల అద్భుత ప్రయాణానికి ముగింపు

న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ తన 27 ఏళ్ల సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణానికి ముగింపు పలుకుతూ నాసాకు రిటైర్మెంట్ తీసుకున్నారు. సునీతా రిటైర్మెంట్ గత ఏడాది డిసెంబర్ 27, 2025 నుంచి అమల్లోకి వచ్చిందని నాసా అధికారికంగా ప్రకటించింది. భారతీయ సంతతికి చెందిన సునీతా విలియమ్స్ 1998లో నాసాకు ఎంపికైంది. తన కెరీర్‌లో మూడు అంతరిక్ష యాత్రల ద్వారా మొత్తం 608 రోజులు కక్ష్యలో గడిపి, అత్యధిక కాలం అంతరిక్షంలో ఉన్న నాసా వ్యోమగాములలో రెండో వ్యక్తిగా ఆమె నిలిచారు. ఆమె చివరి మిషన్‌లో భాగంగా బోయింగ్ స్టార్‌లైనర్ సాంకేతిక సమస్యల వల్ల ఎదురైన సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని, సుమారు 9 నెలల పాటు అంతరిక్షంలోనే ఉండి మార్చి 2025లో సురక్షితంగా భూమికి తిరిగి వచ్చారు.

సునీతా విలియమ్స్ తన కెరీర్‌లో అనేక అద్భుతమైన రికార్డులను నెలకొల్పారు. అలాగే ఆమె మొత్తం తొమ్మిది సార్లు స్పేస్ వాక్ చేసిన మహిళా వ్యోమగామిగా అత్యధిక సమయం (62 గంటల 6 నిమిషాలు) అంతరిక్షంలో నడిచిన ఘనత సాధించారు. అంతరిక్షంలో మారథాన్ పూర్తి చేసిన తొలి వ్యక్తిగా కూడా ఆమె చరిత్ర సృష్టించారు. నాసా అడ్మినిస్ట్రేటర్ జారెడ్ ఐజాక్‌మాన్ ఆమెను ఒక గొప్ప మార్గదర్శకురాలిగా అభివర్ణిస్తూ, అంతరిక్ష అన్వేషణలో ఆమె చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. నాసాలో చేరకముందు యూఎస్ నేవీలో కెప్టెన్‌గా పనిచేసిన ఆమెకు 3,000 గంటలకు పైగా విమానాలను నడిపిన అనుభవం కూడా ఉంది.

## బేగంపేట ఫ్లై ఓవర్‌పై యాక్సిడెంట్.. డివైడర్‌ను ఢీకొట్టి కారు బోల్తా



న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): బుధవారం తెల్లవారుజామున నగరంలోని బేగంపేట ఫ్లై ఓవర్ పై కారు బోల్తా పడింది. వేగంగా దూసుకొచ్చిన కారు డివైడర్ ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అనంతరం స్పాట్ కు వెళ్లిన పోలీసులు.. కారును, ప్రమాద తీవ్రతను పరిశీలించారు. క్రేన్ సహాయంతో కారును అక్కడి నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంతో కొద్దిసేపు ఫ్లై ఓవర్ పై ట్రాఫిక్ నిలిచిపోగా.. పోలీసులు వాహన రాకపోకలను పునరుద్ధరించారు.

## పురుషుని కడుపులో గర్భాశయం.. రిపోర్టు చూసి అవాక్కైన వ్యక్తి

న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలో జరిగిన ఒక విచిత్రమైన సంఘటన ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. స్టేషన్ రోడ్డులో ఉన్న ఒక ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్ చేసిన నిర్లక్ష్యం వల్ల, ఓ వ్యక్తి జీవితం గందరగోళంగా మారే పరిస్థితి వచ్చింది. అసలు విషయం ఏమిటంటే.. 47 ఏళ్ల పురుషుడికి చేసిన స్కాన్ రిపోర్టులో అతడికి గర్భాశయం ఉందని రిపోర్టులో రాశారు. ఆ గర్భాశయం తలకిందులుగా ఉందని పేర్కొన్నారు. తీరా చూస్తే రిపోర్టులో తప్పుగా రాశారని తేలింది. ఈ సంఘటన జరిగింది సాధారణ వ్యక్తికి కాదు. ఉచెహెరా నగర పంచాయతీ అధ్యక్షుడు నిరంజన్ ప్రజాపతి ఈ తప్పిదానికి బలయ్యారు. కొద్ది రోజులుగా ఆయనకు కడుపునొప్పి, వాపు సమస్యలు మొదలయ్యాయి. మొదట స్థానికంగా చికిత్స తీసుకున్నారు. ఉపశమనం లేకపోవడంతో జనవరి 13న సత్నాలోని ఒక డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వెళ్లి స్కాన్ చేయించుకున్నారు. రిపోర్టు చూసిన తర్వాత ఆయనకు ఏం చేయ్యాలో అర్థం కాలేదు. పురుషుడైన తనకు గర్భాశయం ఉందని రాసి ఉండటాన్ని చూసి షాక్‌కు గురయ్యారు.

జబల్‌పూర్‌కు వెళ్లి డాక్టర్‌కు రిపోర్టును చూయించారు. సత్నా రిపోర్టును చూసిన వైద్యుడు ఆశ్చర్యపోయారు. “ఇది మీ రిపోర్టు ఎలా అవుతుంది? పురుషుడికి గర్భాశయం ఉండదు కదా” అని ప్రశ్నించారు. అప్పుడే ఈ పెద్ద తప్పిదం బయటపడింది. దీంతో ఆయన అవాక్కయ్యారు. “ఈ తప్పు రిపోర్టు చూసి డాక్టర్ ఆపరేషన్ చేసుంటే ఎవరు బాధ్యత వహిస్తారు?” అని బాధితుడు సత్నా వాపోయారు. ఈ ఘటన బయటకు రాగానే ఆరోగ్య శాఖలో కలకలం మొదలైంది. డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకుడిని సంప్రదించగా, ఈ విషయంపై స్పందించేందుకు నిరాకరించారు. మరోవైపు జిల్లా ఆరోగ్య అధికారి ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఇది చిన్న తప్పు కాదని, రోగుల ప్రాణాలతో ఆడుకునే పని అని స్పష్టం చేశారు. పూర్తి విచారణకు ఆదేశాలు ఇచ్చామని, నిర్లక్ష్యం రుజువైతే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

## ఐఐటీ కాన్పూర్ పీహెచ్‌డీ విద్యార్థి క్యాంపస్‌లో ఆత్మహత్య..మూడు వారాల్లో రెండో ఘటన

న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): ఐఐటీ కాన్పూర్ లో విద్యార్థుల ఆత్మహత్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. తాజాగా కాన్పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల ప్రకారం, 25 ఏళ్ల పీహెచ్‌డీ స్కాలర్ క్యాంపస్ లోపల ఉన్న నివాస భవనంలోని ఆరవ అంతస్తు నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఇది కేవలం 23 రోజుల్లోపు జరిగిన రెండవ ఆత్మహత్య కేసు. అధికారుల ప్రకారం, మరణించిన విద్యార్థిని రాంస్వరూప్ ఇశ్రాంగా గుర్తించారు. అతను ఎర్త్ సైన్సెస్ విభాగంలో రీసెర్చ్ స్కాలర్. మృతుడు తన భార్య మంజు, వారి మూడేళ్ల కుమార్తెతో కలిసి క్యాంపస్‌లోని న్యూ SBRA రెసిడెన్షియల్ బ్లాక్‌లోని AA 21 అపార్ట్‌మెంట్‌లో నివసించాడు. ఇశ్రాం రాజస్థాన్‌లోని చురు జిల్లా నివాసి.

కళ్యాణ్‌పూర్ పోలీస్ స్టేషన్ నుండి ఫోరెన్సిక్ నిపుణులతో కలిసి పోలీసు బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించాయని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.ఎం. ఖాసిం అబిది తెలిపారు. “విద్యార్థి చాలా కాలంగా మానసిక ఒత్తిడికి లోనవుతున్నాడని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. గతంలో అతనికి చాలాసార్లు కౌన్సెలింగ్ జరిగింది” అని డీసీపీ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం పంపామని, తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ తెలిపారు. మృతుడి కుటుంబానికి సమాచారం అందించామని డీసీపీ తెలిపారు. ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ మణీంద్ర అగర్వాల్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఇన్‌స్టిట్యూట్ ఒక తెలివైన ప్రతిభావంతులైన రీసెర్చ్ స్కాలర్ ని కోల్పోయిందని అన్నారు. డిసెంబర్ 29, 2025న, ఐఐటీ కాన్పూర్‌లో చివరి సంవత్సరం బిటెక్ చదువుతున్న విద్యార్థి తన హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## భర్త నాలుక కొరికిన భార్య.. ట్విస్ట్ మామూలుగా లేదుగా ?

మొదటి పేజీ తరువాయి



నగరంలోని ఒక కాలనీలో నివసించే 25 ఏళ్ల యువకుడు ఒక ప్రైవేట్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, 2025 మే నెలలో ఆ యువకుడికి మీరట్ కు చెందిన ఒక అమ్మాయితో వివాహం జరిగిందని చెప్పారు. తమ కోడలుకి ఈ పెళ్లి ఇష్టం లేదని యువకుడి తండ్రి ఆరోపించారు. ఆమె వేరే యువకుడిని వివాహం చేసుకోవాలనుకుంది. ఆ వివాహిత సిగరెట్లు, మద్యానికి బానిసైందని ఆరోపించారు. ఇది మాత్రమే కాదు, ఆమె రోజంతా మొబైల్ లో మాట్లాడుతూ, రీల్స్ చేస్తూ ఉండేదని అన్నారు. దీనితో పాటు, ఆ వివాహిత తన భర్తను శారీరకంగా కలవడానికి ఎప్పుడూ అనుమతించలేదు. ఈ విషయంపై వివాదాలు ఉండేవి. ఎనిమిది నెలల్లో ఆరుసార్లు పంచాయతీ కూడా జరిగింది, కానీ ఆ వివాహిత ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాలేదని తెలిపారు. నేను మరో యువకుడిని ప్రేమిస్తున్నానని అతను తప్ప మరొకరు నన్ను ముట్టుకోలేరు అని తెగేసి చెప్తోందని అన్నారు.

సోమవారం రాత్రి, భార్యాభర్తలు పై అంతస్తులోని గదిలో నిద్రపోయారు. ఒంటి గంట ప్రాంతంలో, ఆ యువకుడి బిగ్గరగా అరుపులు గది నుండి వినిపించాయి. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకునేసరికి, ఆ యువకుడు నొప్పితో మెలికలు తిరుగుతున్నాడు. అతని నాలుక మంచం మీద పడి ఉంది. కోపంతో ఉన్న వివాహిత దుర్భాషలాడుతోంది. తన భార్యతో సన్నిహితంగా ఉండేందుకు ప్రయత్నించినప్పుడు, కోపంగా ఉన్న భార్య తన పళ్ళతో నాలుకను కొరికిందని యువకుడు కుటుంబ సభ్యులకు చెప్పాడు. వివాహిత యువకుడి నాలుకను పళ్లతో కొరికిందని కాలనీ మహిళలు తెలుసుకున్న వెంటనే వారిలో కోపం పెరిగింది. కోపంతో ఉన్న మహిళలు అక్కడికి చేరుకుని నిందితురాలైన వివాహితను కొట్టారు. యువకుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా, వివాహితపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నిందితురాలు మహిళను అరెస్టు చేశారు. గాయపడిన యువకుడు మీరట్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## పూరి జగన్నాథ్ ఆలయానికి బాంబు బెదిరింపు.. భద్రత కట్టుదిట్టం

న్యూస్ డెస్క్, 21 జనవరి (ఇది కద నిజం ): ఒడిశాలోని పూరి జగన్నాథ్ ఆలయాన్ని పేల్చివేస్తామని మంగళవారం సోషల్ మీడియాలో ఓ పోస్టు వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో ఇవాళ భద్రతను కట్టుదిట్టం చేశారు. ఆన్‌లైన్ పోస్టు ఆధారంగా ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఫేస్‌బుక్‌లో ఆ పోస్టు కనిపించింది. ఆలయాన్ని పేల్చడంతో పాటు బీజేడీ రాజ్యసభ ఎంపీ సుభాషిస్ కుంతియాను అటాక్ చేస్తామని కూడా ఆ పోస్టులో హెచ్చరించారు. షాపింగ్ కాంప్లెక్స్‌ను కూడా పేల్చివేస్తామన్నారు.

అయితే ఆ సోషల్ మీడియా పోస్టు కోసం ఓ మహిళ అకౌంట్‌ను వాడుకున్నారు. ఆమె పేరుతో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫేక్ యూజర్ ఐడీని క్రియేట్ చేసి భయభ్రాంతులకు గురిచేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పూరి సైబర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బాంబు బెదిరింపు నేపథ్యంలో జగన్నాథుడి ఆలయ పరిసరాల చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

పూరి ఎస్పీతో మాట్లాడినట్లు ఎంపీ కుంతియా పేర్కొన్నారు. తనకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి బెదిరింపు కాల్ వచ్చినట్లు కూడా ఆ ఎంపీ తెలిపారు.

# చిన్న అనంతగిరి శివాలయంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేయండి

● రాంబాగ్ శివాలయంలో శివరాత్రి ఉత్సవాలకు పోలీస్ బందోబస్తు కోరుతూ ప్రణవ భక్త సమాజం సభ్యులు ఏసీపీకి వినతి



ఇది కద నిజం, అత్తాపూర్, జనవరి 21: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ పరిధిలోని రాంబాగ్ చిన్న అనంతగిరి శివాలయంలో ఫిబ్రవరి 14 నుండి 16 వరకు నిర్వహించే ఉత్సవాలకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు కల్పించాలని ప్రణవ భక్త సమాజము ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం రాజేంద్రనగర్ ఏ.సీ.పీ. శ్రీనివాస్ ని కలిసి వారు వినతి పత్రం సమర్పించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణతో పాటు భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఏసీపీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రణవ భక్త సమాజము అధ్యక్షులు మోంద్ర నర్సింహా, ఉపాధ్యక్షులు బర్ల మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, ముఖ్య సలహాదారులు నారగూడెం మల్లారెడ్డి, ప్రచార కార్యదర్శి సాబాధ విజయ్ కుమార్, మరియు సుదర్శన్ ప్రసాద్ తివారి తదితరులు పాల్గొన్నారు.

# గంగదారి పల్లెలో బీసీ, ఎస్సి, ఎస్టీ జేఏసీ అవగాహన సదస్సు

● ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కన్వీనర్ గుడిసె బాలయ్య ముదిరాజ్







ఇది కద నిజం,బాలనగర్, జనవరి 21: బాలనగర్ మండల పరిధిలోని గంగదారి పల్లె గ్రామంలో బీసీ , ఎస్సి, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జేఏసీ మండల ఉపాధ్యక్షులు శిల్ల వెంకటేష్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ , ఎస్సి, ఎస్టీ & ఆర్ఎం జేఏసీ మహబూబ్ నగర్ జిల్లా కన్వీనర్ గుడిసె బాలయ్య ముదిరాజ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం జేఏసీ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన ఫలాలను ప్రతి ఒక్కరూ పొందేలా చైతన్యవంతులు కావాలని కోరారు. అనంతరం జేఏసీ భవిష్యత్తు కార్యాచరణ, ఐక్యతను బలోపేతం చేయడం వంటి కీలక అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించి సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు శిల్ల రవీందర్ ముదిరాజ్, ర్యాకల శ్రీకాంత్ ముదిరాజ్, కుమ్మరి పవన్ కుమార్, సామి నాయక్ పాత్లావత్, సీనియర్ నాయకులు శిల్ల శ్రీనివాసులు, పాత్లావత్ రాజు నాయక్, కావలి శేఖర్ ముదిరాజ్, బోయ భూపాల్ వాల్మీకి, భోయ అంజయ్య, శిల్ల అంజయ్య ముదిరాజ్, నర్సింలు ముదిరాజ్, ర్యాకల లింగం తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల మంజూరు: ఏఈ రోజా



ఇది కద నిజం,పరిగి, జనవరి 21: పరిగి మండలం గడిసింగాపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని బుధవారం హౌసింగ్ ఏఈ రోజా పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఈడిగి లక్ష్మికి సంబంధించిన లెంటల్ లెవల్ ఫోటోలను, అలాగే ఎర్ర సత్యమ్మకు సంబంధించిన బేస్మెంట్ లెవల్ ఫోటోలను ఆమె స్వయంగా తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. వీరికి త్వరలోనే సంబంధిత బిల్లులు మంజూరవుతాయని ఏఈ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న మిగతా ఇందిరమ్మ ఇండ్లను కూడా లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని అధికారులు మరియు నాయకులు కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు జి. వెంకట్ రాములు, గోధుమగడ్డ నర్సిములు, గ్రామ పంచాయతీ సభ్యులు మైపాల్, శ్రీనివాస్, యాదయ్య, రాంచరణ్ పాల్గొన్నారు. వీరితో పాటు పంచాయతీ కార్యదర్శి మొగులయ్య, చేన్నారం శ్రీనివాస్ రెడ్డి, బోయని లక్ష్మయ్య, గొట్టం శ్రీనివాస్, మాసాని శ్రీనివాస్, బూసి నరసింహ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య ప్రధాత ఎమ్మెల్యే టీఆర్ఆర్

● లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



ఇది కద నిజం,పరిగి పట్టణం, జనవరి 21: పేద ప్రజల ఆరోగ్యానికి పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి (TRR) అండగా నిలుస్తున్నారని నాయకులు కొనియాడారు. పరిగి మునిసిపల్ పరిధిలోని 8వ వార్డు విద్యారణ్యపురి (తుంకుల గడ్డ) కాలనీలో ఎమ్మెల్యే ప్రత్యేక కృషితో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) చెక్కును బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందిన రాములమ్మ అనే లబ్ధిదారురాలికి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్ పవార్ చేతుల మీదుగా ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పవార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఆపదలో ఉన్న ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందేలా, వారికి ఆర్థిక సహాయం అందేలా ఎమ్మెల్యే నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే టీఆర్ఆర్ చొరవతో ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా మారుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యారణ్యపురి కాలనీ వాసులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆసిఫ్ నగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

● కోర్టు ఆదేశాలు ఉల్లంఘించడంతో రెవెన్యూ చర్యలు



ఇది కద నిజం,హైదరాబాద్, జనవరి 21: ఆసిఫ్ నగర్ మండల పరిధిలోని రామ్‌సింగపుర ప్రాంతంలో కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు బుధవారం నేలమట్టం చేశారు. సర్వే నెంబర్లు 172, 174 నుండి 181 వరకు మరియు 183లోని భూములకు సంబంధించి ప్రస్తుతం కోర్టులో వివాదం నడుస్తోంది. ఈ భూములపై యథాతథ స్థితి కొనసాగించాలని, ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అయితే, కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా కొందరు వ్యక్తులు అక్కడ అక్రమంగా కట్టడాలు చేపట్టినట్లు రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చింది. దీనిపై స్పందించిన ఆసిఫ్ నగర్ మండల రెవెన్యూ యంత్రాంగం, పోలీసుల సహకారంతో రంగంలోకి దిగింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలను భారీ యంత్రాల సహాయంతో కూల్చివేసింది. కూల్చివేత సమయంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించినా లేదా కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

# అత్తాపూర్లో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి




ఇది కద నిజం, అత్తాపూర్,జనవరి 21: అత్తాపూర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి విచ్చేసి, కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అత్తాపూర్ డివిజన్‌లో కాషాయ జెండా ఎగరడం ఖాయమని జోష్యం చెప్పారు. గత పార్లమెంట్ ఎన్నికలను గుర్తు చేసుకుంటూ, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అత్తాపూర్ డివిజన్ నుండి తనకు భారీ మెజార్టీ లభించిందని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. కార్యకర్తలు ఇదే ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోకల శ్రీనివాస్ రెడ్డి, వై. శ్రీధర్, కొమురయ్య, కాడెం సుధాకర్, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత, డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే స్టార్ రాజు, వెంకట్ రెడ్డి, శశికాంత్ శర్మ, సోల్కర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, విజయ స్వామి, విమల్ శర్మ, చేతన్ సింగ్, జిత్తు సింగ్, వేణురెడ్డి, శ్రీపాల్ రెడ్డి, సందీప్, రాజశేఖర్ రెడ్డి,సరిత రెడ్డి, విజయ రెడ్డి, అనురాధ, కృష్ణవేణిలతో పాటు గుర్ప్రీత్ సింగ్, నరేష్, వినోద్ పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో "Arrive & Alive 2026"

● రోడ్డు భద్రతపై పోలీసుల ప్రత్యేక ప్రచారం

● వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి: డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు




ఇది కద నిజం,యాదగిరిగుట్ట, జనవరి 21: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'Arrive & Alive – 2026' రోడ్డు భద్రతా క్యాంపెయిన్ యాదగిరిగుట్ట మండలంలో ఉత్సాహంగా కొనసాగుతోంది. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రయాణికులు మరియు వాహనదారులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. యాదద్రి డీఎస్పీ పి. శ్రీనివాస్ నాయుడు, యాదగిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ బి. భాస్కర్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలు, కళాశాలలు, కంపెనీలు మరియు ఆటో డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, ఫోర్ వీలర్ ప్రయాణీకులు సీట్ బెల్ట్ ధరించాలని స్పష్టం చేశారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్లు మాట్లాడటం, రాంగ్ రూట్లలో ప్రయాణించడం వంటి పనులు చేయకూడదని సూచించారు. పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టకు వచ్చే యాత్రికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, వాహన చోదకులు పాదచారుల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు కోరారు. అలాగే వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుని, గడువులోగా చెల్లించాలని వారు సూచించారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి, రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని డీఎస్పీ కోరారు.

# గురుకుల పాఠశాలలో నాణ్యమైన విద్య




ఇనుగుర్తి, 21 జనవరి (ఇది కద నిజం ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని ఇనుగుర్తి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జయశ్రీ అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని చిన్ననాగారం గ్రామంలో 2026-2027 సంవత్సరం గురుకుల పాఠశాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి,గురుకుల పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెడుపాక సుజాత, ఉపసర్పంచ్ తుమ్మనపల్లి సతీష్, బైరు వెంకటేశ్వర్లు, బైరు అశోక్, కొయ్యడి యాకాంతం,కారోబార్ కురిమల యాకన్న, ఎలగలబోయిన లింగన్న, ఉడుత యాకన్న, పోలోజు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మేడారం మహా జాతరకు వెళ్లే భక్తులకు శుభవార్త

### గిరిజనుల ఆరాధ్య దైవమైన వనదేవతల జాతర





తొర్రుర్, 21 జనవరి (ఇది కద నిజం ): మేడారం జాతరకు తొర్రూర్ నుంచి ఆర్టీసీ టికెట్ ధరలను అధికారులు ఖరారు చేశారు తొర్రుర్ డిపో నుండి 100 బస్సులు అందుబాటులో ఉంటాయి పెద్దలకు 360/-టికెట్ ధర పిల్లలకు 200/- వర్దన్నపేట నుండి పెద్దలకు 300/- పిల్లలకు 150/- ఉంటుంది ఇంటి వద్దకే మేడారం ప్రసాదం అవకాశం కల్పించిన టీజీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ వి. పద్మావతి తెలిపారు ఈనెల 25 నుంచి 31 వరకు ఆర్టీసీ బస్సులు మేడారం అమ్మవారి గద్దెల వరకు వెళతాయన్నారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మేడారం జాతరకు ఈ స్పెషల్ బస్సుల్లో కూడా మహిళలకు మహాలక్ష్మి స్కీమ్ వర్తిస్తుందని,ఈ అవకాశాన్ని తొర్రూర్ పరిసర ప్రాంతాల భక్తులు వినియోగించుకోవాలని కోరారు. ఈ ధరలపై ఆర్టీసీ అధికారులు విస్తృత ప్రచారం చేపడుతున్నారు.

# జనవరి 25న హైదరాబాద్ జరిగే ఐద్వా బహిరంగ సభను జయప్రదం చేయండి

**అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం తొర్రూర్ మండల కార్యదర్శి బొల్లం మమత పిలుపు.**

**ఐద్వా 14వ జాతీయ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ**



తొర్రూరు, 21 జనవరి (ఇది కద నిజం ): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 14వ జాతీయ మహాసభల సందర్భంగా జనవరి 25వ తేదీన జరిగే హైదరాబాద్ ఆర్టీసీ గ్రౌండ్లో జరిగే బహిరంగ సభను ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఐద్వా తోరూర్ మండల కార్యదర్శి బొల్లం మమత పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 14వ జాతీయ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల కార్యదర్శి బొల్లం మమత మాట్లాడుతూ, మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సంఘం ఆధ్వర్యంలో అనేక ఆందోళన,పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం ఐద్వా అని ఆమె కొనియాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై జరుగుతున్నటువంటి దాడులు దౌర్జన్యాలను ఆపడంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. మహిళల రక్షణ కోసం ఉన్నటువంటి చట్టాలను సమర్ధవంతంగా అమలు చేసి మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు అని వారి సందర్భంగా గుర్తు చేశారు. మహిళల సంక్షేమం కోసం నిత్యం పోరాడే సంఘం ప్రజాతంత్ర మహిళా సంఘం అని ఆ సంగం అఖిలభారత మహాసభలు హైదరాబాద్ నగరంలో జనవరి 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు జరుగుతున్నాయని, ఈ సందర్భంగా జనవరి 25వ తేదీన జరిగే బహిరంగ సభకు మహిళలందరూ పాల్గొని ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలని వారి సందర్భంగా పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో శ్రీరంగం రాధా, పల్లె పద్మ, దొండి కృప, చిన్నమ్మ, సమ్మక్క, మోతే చైతన్య, సరస్వతి, మచ్చ యాకమ్మ, ఊర్మిళ, పల్లె స్వాతి,గాజుల లక్ష్మి, కలమ్మ ,యాదమ్మ ,మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# గృహలక్ష్మీ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలి



ఇనుగుర్తి, 21 జనవరి (ఇది కద నిజం ): గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో గృహలక్ష్మీ పథకంలో భాగంగా నిర్మించుకున్న ఇండ్లకు వెంటనే బిల్లులను మంజూరు చేయాలని ఇనుగుర్తి మండల సిపిఎం పార్టీ కార్యదర్శి గుడిశాల వెంకన్న ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా గొడిశాల వెంకన్న మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం నెల్లికుదురు మండలం చిన్ననాగారంలో నిరుపేదలకు గృహలక్ష్మి పథకంలో భాగంగా 09.09.2023న 3లక్షల రూపాయలతో రెండు గదుల ఇంటి నిర్మాణ కోసం అప్పటి నెల్లికుదురు ఎంపీడీవో ప్రోసిడింగ్ కాపీలను గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా లబ్ధిదారులకు అందజేశారు కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల బిల్లులు రాలేదని, లబ్ధిదారులు ఇంటి నిర్మాణం కోసం అప్పులు తెచ్చి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు కావున ప్రభుత్వం వెంటనే స్పందించి గృహలక్ష్మి బిల్లులను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కురిమల రమ యాకన్న, ప్రమీల, నరసమ్మ, సావిత్ర,యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అన్ని విభాగాలు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

- **రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాటించాలి**
- **జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్, 21 జనవరి (ఇది కద నిజం ): రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగానే జిల్లాలో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు అన్ని విభాగాలలో విధిగా పోలీస్ రవాణా శాఖ సంబంధిత అన్ని విభాగాల అధికారులు విస్తృతం ప్రచారం కల్పించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు, జిల్లాలో మరిపెడ,కురవి, తొర్రూరు, నెల్లికుదురు, బయ్యారం, హైవేల వెంబడి ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణ కోసం సంబంధిత విభాగాలు ప్రతిపాదనలు సిద్ధం చేసి చిన్నచిన్న రోడ్డు మరమ్మత్తులు ఉంటే వెంటనే సరి చేయాలని విషయ సూచికలు ఏర్పాటు చేయాలని, త్రాగి వాహనాలు నడపకుండా తగిన జాగ్రత్తలు తనిఖీలు నిర్వహించాలని, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించి జీబ్రా క్రాసులు ట్రాఫిక్ రూల్స్ పక్కాగా పాటిస్తూ ఉండే విధంగా సామాన్య ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు,

స్కూల్ బస్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టి ఫిట్నెస్ ఉన్నాయా లేవో తనిఖీ చేయాలని, డ్రైవర్ సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపకుండా అతనికి తగు ఆదేశాలు జారీ చేయాలని, నిత్యం వారికి వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ కంటిచూపు తదితర అన్ని తనిఖీ చేయాలని సూచించారు, ఆర్టీసీ బస్సుల డ్రైవర్ల యొక్క ఆరోగ్య స్థితిగతులను పరిశీలిస్తూ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించాలని అన్నారు,

అధిక లోడు, అతివేగం, రాష్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా, నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే ప్రతి ఒక్కరి పైన ప్రభుత్వ సూచనల ప్రకారం జరిమానాలు విధించాలని, ప్రభుత్వ కార్యాలయాలలో విధిగా హెల్మెట్ ధరిస్తేనే కార్యాలయానికి అనుమతించే విధంగా ముందస్తు సమాచారంతో తెలియజేయాలని సూచించారు,

పోలీస్,రవాణా సమన్వయంతో క్షేత్రస్థాయిలో అవగాహన (ప్రచార) కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, అదే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించి వారి క్షేమం వారి కుటుంబ క్షేమం కోసం కృషి చేయాలన్నారు,

నేషనల్ హైవే, మున్సిపల్, పంచాయితీ రాజ్, రోడ్లు భవనాల శాఖ రహదారుల వెంబడి బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివారణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు,

ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, ఆర్టీవో జైపాల్ రెడ్డి, ఆర్ అండ్ బి, పిఆర్ ఈఈలు భీమ్లా నాయక్, విద్యాసాగర్,సంబంధిత విభాగాల అధికారులు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# భారత గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్





మహబూబాబాద్, 21 జనవరి (ఇది కద నిజం ): భారత గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులకు సూచించారు, బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో కలిసి ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు, భారత గణతంత్ర దినోత్సవం నిర్వహణ సందర్భంగా జిల్లాలో అన్ని విభాగాలు సమన్వయంతో కలిసి పనిచేయాలని, ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు అందుతున్న వివరాలపై జిల్లా సమగ్ర నివేదిక ప్రసంగం రూపంలో రూపొందించాలని,వేడుకలకు హాజరయ్యే స్వాతంత్ర సమరయోధులు,అతిథులు, ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖుల విద్యార్థిని, విద్యార్థులు, అధికారులు సిబ్బంది అందరికీ ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ అరేంజ్మెంట్స్, సౌండ్ సిస్టం, షామియానాలు, త్రాగునీరు స్నాక్స్ అందించాలని, వేడుకలు జరిగే ప్రాంతంలో పోలీస్ సిబ్బంది భద్రత, ఫైర్ విభాగం, రోడ్లు భవనాల శాఖ అధికారులు సంబంధిత సౌకర్యాలు కల్పించాలని సూచించారు,వివిధ శాఖలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అవార్డు కోసం ప్రతిపాదనలు పంపాలని తెలిపారు, జిల్లాలోనీ అన్ని మున్సిపల్ పరిధిలలో గ్రామపంచాయతీ, వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో ప్రోటోకాల్ ప్రకారం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించాలని తెలిపారు, ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారినీ కృష్ణవేణి, డి.ఎస్.పి తిరుపతిరావు,అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, పర్యవేక్షకులు రాజేష్, తదితరులు పాల్గొన్నారు,

# ఉజ్జయిని మహంకాళి నగర్ కాలనీ సమస్యలపై పాదయాత్ర చేసిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



అల్విన్ కాలనీ, 21 జనవరి (ఇది కద నిజం ): శేర్లింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉజ్జయిని మహంకాళి నగర్ కాలనీ లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనుల పై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎమ్.సి అధికారులు మరియు కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఉజ్జయిని మహంకాళి నగర్ కాలనీలో కొంతమేర డ్రైనేజీ మరియు సీసీ రోడ్లకు సంబందించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని, వాటిని శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి మరియు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాంక్షన్ చేయించి అతి త్వరలో నిర్మాణ పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చారు. కాలనీలో కొన్ని చోట్ల విద్యుత్ స్తంబాలు రోడ్డు మీద ఉండి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని కాలనీ వాసులు కార్పొరేటర్ కు తెలియచేయగా, విద్యుత్ స్తంభాలను వెంటనే రోడ్డు ప్రక్కకు మార్చాలని కార్పొరేటర్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. డివిజన్ సమగ్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతామని, కాలనీలో పెండింగ్లో ఉండి అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, గోపాల్, అశోక్, పాండు, వై.శ్రీనివాస్, రాము, రమణ, సారాయి కృష్ణ, షౌకత్ అలీ మున్నా, లింగం, సుధాకర్, సత్తయ్య, రమేష్. జి.ఎచ్.ఎమ్.సి అధికారులు ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, యూబీడీ నాగరాణి, ఎంటమాలజీ సూపర్వైజర్ డి.నరసింహులు, వాటర్ వర్క్స్ సూపర్వైజర్ శివ, ఎస్.ఎఫ్.ఎ వెంకటరెడ్డి & మల్లేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబానికి అండగా బాల్య మిత్రులు

**ఫోస్టాఫీస్ లో రూ.50 వేల ఫిక్స్డ్ డిపాజిట్**



తొర్రుర్, 21 జనవరి (ఇది కద నిజం ): అకాలంగా మరణించిన బాల్య మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచి మానవత్వానికి అద్దం పట్టారు అతని బాల్య స్నేహితులు. గోపాలగిరి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన నాగుల్ మీరా అనారోగ్యంతో బాధపడుతు మరణించారు. మిత్రుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు 2007-2008 పదవ తరగతి కి చెందిన బాల్య మిత్రులు మరియు మిత్రుల యొక్క వాట్సాప్ స్టేటస్ చూసుకొని సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. మిత్రుడి కుటుంబ భవిష్యత్ భద్రతను దృష్టిలో పెట్టుకొని రూ.50 వేల మొత్తాన్ని సమీకరించి మిత్రుడు కుమారులు రియాన్, సోహెల్ పేర్ల మీద ఫిక్స్డ్ డిపాజిట్ చేయించారు. ఈ సహాయం కుటుంబానికి కొంతమేర ఆర్థిక భరోసా కల్పించడమే కాకుండా, స్నేహబంధాల గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పింది.వారికి పాస్ బుక్స్ అప్పజెప్పిన వారు దొంతోజు వెంకటేష్, ఎనమాల రాకేష్, ఎల్పుకొండ రాంబాబు, అనుమాండ్ల గౌతమ్ రెడ్డి, నరేందర్, నీరజ, సరిత, ఎడ్ల రమ్య, శ్రీనివాస్,వారి కుటుంబ సభ్యులు నస్రీన్, లతిబ్బి, గ్రామస్తులు మూడో వార్డు సభ్యులు ఎనమాల లక్ష్మీప్రసన్నకుమార్, సుశ్రుత ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎనమల రవి, డాక్టర్ షేక్ అలీ, షరీఫ్,మనో,సమీర్ తదితరులు పాల్గొన్నారు.

